# ఇది మరో ప్రేమకథ

- అనంతరాయలు

ఆలస్యం చేయకుండా త్వరగా బయలు దేరమన్నట్లు గంట కొట్టారు. గార్డు ఎడం చేతితో నోట్లో ఉన్న విజిల్‌ను ఎక్కడ కింద పడుతుందో అన్నట్లుగా గట్టిగా వేళ్ళతో అదిమి పట్టి బిగ్గరగా ఊదుతూ, పచ్చ జండా గాలిలో ఎగర వేస్తున్నాడు.

ఈ రైలు బయలుదేరి వెళ్ళిపోయినా, నాలో ఉండే జనసమ్మర్దం ఏ మాత్రం తగ్గిపోదులే అనే ధీమాతో ఉంది సెంట్రల్ స్టేషను. గంటను, గార్డును చూడగానే గుండె గతుక్కుమంది రవికి. కొన్ని గజాల దూరం పరుగెత్తితే కాని రైలు చివరి బోగీని అందుకోవటం సాధ్యం కాదని తెలిసి, పిక్కబలం చూపించటానికి సిద్ధ పడ్డాడు. ఈ సామాను ఒకటి. దానికి తోడు నడవడం మించి మరే విధంగానూ రైలుని చేరలేని కూలివాడొకడు. తన చేతకానితనానికి తనే విసుక్కున్నాడు రవి. "ఓడివా, తంబీ... ట్రైను పోరప్పడది..." వచ్చీ రాని అరవంలో గట్టిగానే అరిచాడు. తను చెప్పింది కరెక్టేనా కాదా అనే అనుమానం లేకపోలేదు రవికి.

పోనైతే నేం, అదృష్టవశాత్తు రైలు చివరి పెట్టె—అంటే ప్లాట్ ఫారమ్ మొదట్లోనే ఉన్న త్రీ—టయర్ స్లీపింగ్ కంపార్టుమెంటులో తా నెక్కి కూలి వాడి దగ్గరి నుంచి సామానులు అందుకునేసరికి రైలు సుమారైన వేగాన్ని పుంజుకుంది. కూలివాడికి చిల్లర ఇద్దామని ప్రయత్నిస్తూ జేబులో చెయ్యి పెడితే, జేబు ఇరుగ్గా ఉండటం వల్ల ఒక పట్టాన తేలికగా బయటికి రాలేదు. ఆ ఇవ్వబోయే దెంతో, తన కెంత ప్రాప్తమో తెలుసుకుందామన్న ఆత్రతతో గట్టిగా అరిచినా వినిపించదని చిల్లర ప్లాట్ ఫారమ్ మీద పార వెయ్యమని సంజ్ఞ చేస్తున్నా, అనుకోకుండానే వాడికి అన్యాయం జరగనే జరిగిపోయింది. కొన్ని వందల గజాల దూరాన్ని దాటిపోయిన రైలు ప్లాట్ ఫారమ్‌ని వదిలి కొన్ని క్షణా లవటంతో కూలీకి అందుతుందన్న నమ్మకం లేక ఆ ప్రయత్నాన్ని విరమించుకోవటం జరిగింది.

అప్పుడే చెకింగ్‌కు బయలుదేరిన కండక్టరు సహాయంతో తన బెర్తు నంబరు తెలుసుకుని, సామానులన్నిటిని తనే మెల్లగా లాక్కుంటూ బెర్తుని సమీపించి, ఇతర బెర్తుల్ని ఆక్రమించిన వాళ్ళను చూడగానే రవికి గుండె ఆగినంత పనయింది. తనతో నిమిత్తం లేకుండానే తల నేలను చూసేందుకా అన్నట్లు వాలిపోయింది. 'రూపాయి లాభం'-కామెంటు.

వెంటనే కిసుక్కుని నవ్వు. ఒక దానికి మరి కొన్ని గొంతులు వంత పాడాయి. రవికి ఏడు పొచ్చినంత పని అయింది. ఆ రోజున తన ఖర్మ కాలిం దనుకున్నాడు. ఆ క్యూబికిల్‌లో ఉన్నవే *ఆరు బెర్తులు. అందుట్లోనూ* ఒకటా, రెండా? పంచ పాండవుల్లా ఎటొచ్చీ సెక్సు డిఫరెన్సు తప్పించి మిటమిట లాడే వయస్సులోని పంచదార చిలక లయిదు, యౌవనం పెటపెట లాడుతూ తుళ్ళుతూ గెంతే యావగల నిండు జవ్వనులు ఆక్రమించా రాయెను. ఏ దురుద్దేశం తనకి లేకపోయినా, తనని దోషిగా మార్చిన చిన్న సంఘటన ఓ పక్క బాధ పెడ్తేస్తూ మనసుని కొరికేస్తూంటే, ఆ కొతుల పడుమ మద్రాసు నుంచి హైదరాబాదు వరకు ప్రయాణమా? 'భగవాన్! యూ ఆర్ క్రూయల్! పగవాడికికూడా వద్దు, స్వామీ!' రవి వంచిన తల పైకెత్తకుండా మథన పడ్డాడు. అసలు తను స్టూడెంటుగా చిన్నప్పుడు మొదలు కాలేజీ వదిలిన వరకు కో-ఎడ్యుకేషన్ సంస్థలోనే గడిపేసినా, ఆడపిల్ల ఎదురయిన సందర్భాలలో ఎలా ఉన్నా, అన లెదురవుతుందేమో నన్న అనుమానం తగలగానే మారుమూలగా ఉన్న ఏ వరండానో శరణనుకుని, ఆ వరండాల్ని మార్చి మార్చి అటూ ఇటూ చూస్తూ చూస్తూ, తల వంచుకునే తప్పించుకున్న అనేక సంఘటనలు లేకపోలేదు. కాని, అనుకోకుండా అయిదుగు రాడపిల్లల్ని అల్లరి పెట్టడంలో ఒకర్ని మించి మరొకరు పోటీ పడుతున్న వాళ్ళను చూడగానే రవికి తల కింద దిగటంతో పాటు బుర్ర పని చేయటం మానేసింది.

"వీడే ననుకుంటా ఈ కింది బెర్తు? ఒసేవ్! అటు జరగవే, బాబూ! ఆఁ కూర్చోండి. ఎందు కా సంశయం? ఆ పక్కగానే కూర్చోండి. అమ్మ! కూర్చున్నారా? అయితే, ఇప్పు డొక చిన్న రిక్వెస్టు! మీ రేమనుకోకపోతే, ఆ కింద బెర్తు మీకే కేటాయించినా, మీ రా పై బెర్తు తీసుకుంటారా? నా ఫ్రెండ్ పైకి ఎక్కాలంటే ఇబ్బంది పడిపోతూంది, పాపం!"

ఎవరు బతిమిలాడారో రవికి తెలియదు. తన. జవా బేం ఇవ్వాలో అంత కన్నా తెలియదు మరి. ఏదో చెప్పా లన్నట్లుగా నోరు విప్పే లోగానే మళ్ళీ ఆ గొంతే అందుకుంది: "అహఁ. డోంట్ వరీ. *ఇప్పుడే కాదనుకోండి. రాత్రి* పడుకునేముందు సంగతిలెండి."

మద్రాసులో ఉన్నది కొద్ది రోజులే కావటం మూలానో ఏమో, ఎండ ఆట్టే లేకున్నా ఒళ్ళంతా విపరీతమయిన చెమట పట్టేసి బంక బంకగా తయారయింది, మనస్సుకి చీదరేసేటట్లు. దానికి తోడు నాలుక పిడచ కట్టుకు పోయింది. సెంట్రల్ స్టేషను చేరటానికి టైము వృథా కాకపోతే స్టేషను చేరగానే రెండు, మూడు కూల్ డ్రింకులు పట్టించేసి సమాధాన పడాలనుకున్న రవికి ఆ అస్కారం లభించనే లేదు. పైపెచ్చు భరించలేని ఆ ఆడ మూక, నోటిలో మిగిలిన ఆ కాస్త తడినికూడా ఆరిపోయేటట్లు చేయటంతో ఎంతగా ప్రయత్నించినా నోటి వెంట మాటలే పెగల్లేదు రవికి.

అయితే, సభ్యత ఒకటి అడ్డు వచ్చి పడడంతో 'సరే' నన్నట్లు భయం భయంగా తల పైకి ఎత్తి ఎత్తకుండా అంతవరకు మాట్లాడిన అమ్మాయిని గమనించగానే 'అరే, మీరా' అనబోయి అనలేక పోయాడు రవి.

అయితే మాత్రం ఆ గడుగ్గాయి ఊరుకుంటుందా?

'అరే... ఆశ్చర్యం! మీరా?' కొంత సేపాగి, 'అయితే' కథలు రాసే రవిగారా లేక కథలు చదివే రవిగారా?' నోరు వెళ్ళబెట్టింది పాపం.

క్షణం సేపు చూసి, మాటలు యథా ప్రకారంగా రాకపోవటంతో తనే మళ్ళీ సంభాషణ పొడిగించింది: 'అవును. నా ఊహ ప్రకారం మాట మాట్లాడితే ముత్యాలు రాలిపోతాయని ఫీలయ్యే మిమ్మల్ని చూస్తూంటే, మీరే కథలు రాసే రవిగా రన్న మాటా! హేయ్ గేల్స్! మీట్ మిస్టర్ రవి!' నేను హైదరాబాదులో చదువుకున్న రోజుల్లో నా క్లాస్‌మేట్. గొప్ప కథకుడు. చాలా రాశా రనుకుంటాను—ఇఫ్ ఐ గెస్ కరెక్ట్!

చిన్న సవరణ. కాదులే. ఆఁ ఏమనాలి? ఆఁ ఆ చిన్న మార్పు—కొంప దీసి కథలు చదివే వారయితే మాత్రం కేవలం నా క్లాస్‌మేట్ వరకే పరిమితం. కాని, కథలు రాసే రవి మాత్రం మా పక్క ఇంటి అబ్బాయి. నా చిన్న నాటి నేస్తం. ఆటల్లో తోడు...' ఇంకా ఏదో చెప్ప బోతూ ఆగిపోయి, రవి కుడి చేతిని నిశితంగా కళ్ళతోనే పరీక్షించి, ఉన్నట్లుండి ఏదో గుర్తొచ్చిన దానిలా పోజు పెట్టి త ననుకున్నది సరయినదే నన్న విజయగర్వం కనిపించేటట్లు కంటి నిండా తృప్తిని నింపుకుని, 'ఎస్. నేనే కరెక్టు. ఆ చేతి మీద కాలిన మచ్చ చూశారా? ష్యూర్ ఫెలో! దానికి నేనే కారణం. మీ[illegible] గుర్తుందా, రవీ?' అంది. రవికి [illegible] కొంత ధైర్యం చిక్కింది. ఏ మూలనో నిద్రపోతున్న పురుషత్వం ఉన్నట్లుండి మేల్కొంది. కర్చీఫ్‌తో ముఖాన్ని తుడుచుకుంటూ, 'ఏమనుకోకపోతే ఓ గ్లాసుడు మంచి నీళ్ళిస్తారా?' అని అడగటమే తరువాయన్నట్లుగా తన పక్కనే నీళ్ళతో నింపిన ఫ్లాస్కులోంచి ఐస్ వాటరు గ్లాసు నిండా నింపి రవి చేతికి అందిచ్చింది, అయిదుగురిలో చెల్లగా ఉన్న పన్నెండేళ్ల పిల్ల.

'జాగ్రత్త, వనజా! మళ్ళీ గూడూరు చేరుకుంటేనే కాని నీళ్ళెక్కడా దొరకవు. ఈ రైలా గూడూరు వచ్చిందాకా మరెక్కడా ఆగదనుకుంటా?' నల్ల పిల్ల పక్కనే కూర్చున్న పొట్టి పిల్లను నమిలి మింగేయాలన్నంత కోపం వచ్చేసినా, ఒక దాని తరవాత మరొక గ్లాసును ముగించ లేకుండా ఉండిపోవటం చేత కాలేదు రవికి. నీళ్ళేమో చల్లగా, కమ్మగా ఉన్నాయి. దప్పికా తీరలేదు. రెండు గ్లాసుల నీళ్ళు గొంతులో ఎన్నో భాగాన్ని తడిపిందో అర్థమే కాలేదు రవికి. అడిగి మరీ తాగాలనిపించినా, ముందుగానే తన చేతులకి సంకెళ్ళు వేసి బిగించటంతో మొగమాట పడ్డాడు రవి.



ఈ లోపల మళ్ళీ సంభాషణ ప్రారంభించనే ప్రారంభించింది రెండు జడల పిల్ల. 'అయితే, ఇంతకీ నేను మీకు జ్ఞాపకం లేనంటారా, రవీ?'

'మీ పేరు అనూరాధ కదూ?'

తన నోటి నుండి ఎట్టకేలకు మాట ఊడి పడిందనో, ఎందుచేతనో కాని అయిదుమంది కలిసి కట్టుగా ఫక్కున నవ్వేసి, తిరిగి వెంటనే బాగుండదని కామోసు గప్‌చిప్ అయిపోయారు.

వాళ్ళాగిపోయినా, ఈ సారి మాత్రం రవికి నిజంగానే శౌరు పుట్టింది. కర్మ కాకపోతే ఇదేం గొడవ తనకి?

మంచినీ ళ్ళిచ్చిన వనజ, ఆ నీళ్ళలాగనే చల్లగా అంది: 'అనూరాధ కాదు. . . రాధ మాత్రమే!'

జ్ఞాపకం వచ్చినట్లు చిన్నగా నవ్వి, తప్పు జరిగిందే అని నాలుక కొరుక్కోకుండా రవి ఆలోచించుకోవటం ప్రారంభించాడు అంత గొడవ లోనూ, గందరగోళం లోనూ.

హైదరాబాదు రైలు చేరుకునే లోపల బోలెడు టైముంది కాబట్టి, కాలాన్ని నెట్టి పారేయటానికి కంపెనీ కూడా ఏమీ ఉండదు కాబట్టి, ఆ ఉన్న టైమ్‌లో ఏదో ఒక కథ వ్రాసి పారేయాలని ముందుగానే ఒక ప్లాటు సిద్ధం చేసుకున్నాడు రవి. ఆ కథకు ఇతివృత్తం కేవలం ఊహల్లో జనించింది మాత్రం కాదు. ఒక రోజు సాయంత్రం... మెరీనా బీచి... తనకు బీచి కొత్త. ఆ రోజు సెలవు దినం కాకపోయినా, బీచిలో జనం బాగానే ఉన్నారు. అక్కడక్కడ తప్పించి అందరి ముఖాల్లో ఆనందం తాండవిస్తోంది. పడుచు జంటలు అనుకుని కూర్చుని ఏవో గుసగుస లాడుకుంటూ. మధ్య మధ్య సముద్రంలోని కెరటాల్లాగ, తెరలు తెరలుగా వచ్చే నవ్వుల్ని ఆపాలన్న ప్రయత్నాన్నే మానుకున్నారు. సభ్యత అనేది ఇలాటి చోట అడ్డు రాదేమో అనుకున్నాడు రవి. ముసలి [illegible] మీద, చిన్న పిల్లల మీద రవి దృష్టి పోనేపోదు. తినుబండారా లమ్మే వ్యక్తుల మీద తన దృష్టే కేంద్రీకరించడు.

తనుకూడా ఒక చక్కటి పడుచుతో, ఇసకలో వేళ్ళతో గీస్తూ, కళ్ళుప్పగించి చూస్తూ, ఆ చిన్నదాని కళ్ళను సూటిగా చూస్తూ, కళ్ళతోనే ఏవేవో సంకేతాలు ఎవరికీ అర్థం కాని భాష లాంటి కను సైగలతో ఆమెని ఉక్కిరి బిక్కిరి చేస్తే ఎంత బాగుంటుంది! ఉన్నట్లుండి తన కాస్త దూరం గాకుండా, ఒక్కతే తన వైపే చూస్తూ భాష కందని భావాలేవో తనకు మతి పోయే సంకేతా లిస్తూ ఉంటే, వర్ణించ నలవికాని సౌందర్య రాశి ఒకామెను రవి చూడటం సంభవించింది. మనస్సు నాక్రమించుకున్న సిగ్గు, సంకోచం ఎన్ని ఆమడల దూరం పారిపోయాయో కాని, ఆమెను అప్పుడప్పుడు ధైర్యంగానూ, అనుకోకుండా దొంగ చూపుల ద్వారానూ కొంచెం సేపు చూస్తూ ఉండటం ముగించి వేయటానికేమో అన్నట్లు ఆమె ఉన్నట్లుండి లేచి నిలబడింది.

రవి మనస్సు కొట్టుకు పోయింది. బాధగా మూలగటం ఆరంభించింది. కొన్ని శతాబ్దాల పరిచయా నంతరమో, కొన్ని జన్మల అనుబంధమో గల స్త్రీ తన ప్రేమారాశి తన కేదో దూరమవుతున్న భావం రవిని పిచ్చి వాడినే చేసేసింది. తనింకా కొంచెం సేపు అక్కడే కూర్చుని ఉంటే బాగుండు ననిపించింది రవికి. కాని, ఇవేమీ తనకు పట్టనట్లు 'ట్రయంఫ్ ఆఫ్ లేబర్' విగ్రహం వైపు ఇసకలో దిగబడుతూ ఉన్న పాదాలను సుతిమెత్తగా పైకి లేపుతూ అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్న ఆమె, తనను దాటి వెళ్ళి తీరాలన్న ఆలోచన రాగానే గుండె వేయి సార్లు కొట్టుకుంది. మనస్సు జిల్లుమంది. అదేదో తీపి బాధ ఒళ్ళంతా పెనవేయగా, శరీర రోమాలు నిక్క బొడుచుకున్నాయి.

తనను సమీపించగానే మరింక నేనెక్కడికి కదల నన్నట్లుగా ఉన్నట్లుండి ఇసకలో చతికిలబడి, తన నింతవరకు పిచ్చివాణ్ణిగా చేసిన చిరునవ్వుతోనే రవిని మళ్ళీ తన్మయత్వంలో ముంచేసిం దామె. 'తెలుగా?' గొంతులో వేయి వీణల సంగీత మాధుర్యం పలికింది. భయం పారిపోయింది. అర్థమయినట్లుగా తల ఊపుతూ రవి, 'అవును' అని మాత్రం అనగలిగాడు. అమ్మాయి కనిపించగానే ఆమడ దూరం పారిపోయే తనకు, అమ్మాయి దగ్గర రవగానే వేయి బంగారు తప్పెట్లు మనస్సులో మోగవలసింది పోయి, అంత ధైర్యం ఎలా వచ్చిందా అని ఆలోచించే స్థితిలో లేడు రవి.

'మాదీ తెలుగే' అన్న దామె మళ్ళీ. అలానా? అన్నట్లు చిరునవ్వు వెలిసింది. ఆ నవ్వు ముఖంతోనే రవి ఇంకేమిటి సంగతులు అన్నట్లు చూశాడు. మాట్లాడటానికి తనకు చాలా విషయాలున్నా, మాట్లాడటం చేతకాని వాడిలా ఉంది అతని చూపు.

'సినిమాల్లో వేషం వేస్తూ ఉంటాను లెండి. మీరు నన్ను గుర్తు పట్టగలిగే టంత పెద్ద పాత్రలేవీ ఇంతవరకు వేయలే దనుకోండి." మళ్ళీ నవ్విం దామె.

మాట్లాడే బదులు అలాగే నవ్వుతూ ఉండకూడదూ అనుకున్నాడు. 'మీరు పెద్ద పాత్రలో కనిపించి ఉన్నా ఆ మాట కొస్తే గుర్తు పట్టలేను లెండి.' మాటల్ని తుంచి వేస్తూ మళ్ళీ ఆమె అడిగింది అదే చిరునవ్వుతో: 'సినిమాలు ఎక్కువగా చూడరన్న మాట. అంతే కదూ?'

'అదేం కాదనుకోండి. చాలా అరుదు.' అంతకు మించి ఏం మాట్లాడాలో అర్థం కాకపోవటంతో సంభాషణ ఆగిపోయింది. వెంటనే మళ్ళీ నవ్విం దామె. ఆ నవ్వులో ఎంత హాయి ఉంది! తను మత్తులో ఒదిగిపోయి, తేలికగా మరో లోకానికి ఎగిరి పోవడానికి వీలుగా ఉన్నట్లుంది.

ఉన్నట్టుండి ఆమె—'రూమ్ ఉన్నదా?' అని ప్రశ్నించటంతో, ఏ ప్రయత్నమూ లేకుండానే 'ఆఁ' అనేశాడు రవి. 'అయితే, పదండి పోదాం. ఈ చల్లని గాలి బదులు వేడి గాలి, దగ్గరగా కూర్చునే బదులు ఒకరి ఒళ్ళో మరొకరు ఒదిగి పోవచ్చు. ఈ చల్లని గాలికే మీరు తన్మయత్వం పొందితే, దీన్ని మించిన మరొక స్వర్గం మనకోసం ఎదురు చూస్తోంది.' సినిమాల్లో నటించే ఉంటుందనుకున్నాడు రవి. వెంటనే ఆ సంభాషణలోని ఆంతర్యం అవగాహన అవటంతోనే అవాక్కయాడు రవి. 'నా రూమ్‌కి మీ రొస్తారా? ఓ...నో! ఆ విస్సుగాడు.— అదేలెండి మా చిన్నాన్న కొడుకు—నన్ను నిలువునా చీల్చేసి గద్దల కేసేస్తాడు.' మళ్ళీ అదే చిరునవ్వు. రవి గుండె ద్రవించిపోయింది. 'పోనీ, మరెక్కడ కయినా సరే మీ ఇష్టం. వెళ్ళకూడదూ మనం? ఓహ్! నా కేమో బోరుగా ఉంది, బాబూ!' రవికి ఈసారి అర్థం కాలేదు. ఆలోచించాలన్నా బుర్ర పని చేయటం లేదు మరి. 'ఏమిటీ ఈమె అనేది? నే నెవరో తెలియదే! నాతో ఎక్కడి కయినా వచ్చేస్తాననటం ఆశ్చర్యంగా ఉందే! ఆమె కిల్లు వగైరా ల్లేవా? ఇప్పటికే బాగా ఆలస్య మయింది కదా—మరీ చీకటయితే ఇంట్లో తన నేమీ అనరా? కొంపదీసి. . .' బుర్ర చురుకుగా ఆలోచించటం ప్రారంభించగానే, తన ఆలోచనలో అనుమానం పొడసూపి నట్లు, ఒక వేళ నిజమే నయితే?' మాట లాగిపోయాయి. రవి ఒళ్ళంతా సన్నగా వణకటం ప్రారంభించింది.

'నో, నో! డోంట్ వర్రీ! రెండు వందలుంటే చాలు.' ఆ దెబ్బతో ఎక్కువయిన వణుకు, ఎంత దూరం నుంచి చూసిన మనిషి కయినా స్పష్టంగా కనిపించే టంత పెద్ద దయింది.

ఉన్నట్టుండి ఆమె నవ్వాగి పోయింది. 'నా గురించి తప్పుగా అర్థం చేసుకోకు. నే నందరి లాంటి దాన్ని కాదు. నా కిష్టమయితే తప్ప నే నెవ్వరినీ ఆహ్వానించను. నిన్నుమళ్ళీ చూడగానే నా మనస్సు చలించి పోయింది. ఉండబట్టలేక, ఆత్మాభిమానం చంపుకుని, స్త్రీ సహజమయిన సిగ్గుని దూరంగానే నెట్టేసి నిమ్మళ్ళి రమ్మని గలిగాను. చూడండి— వృత్తి రీత్యా కావాలనుకుంటే కొన్ని వేలు సంపాదించగలను. కాని, తృప్తి దొరుకుతుందా దానిలో? నో, నో . . . నెవర్. కుర్రాడివి. నదురుగా కనిపించావు. . . అంతకన్నా ఇచ్చుకోలేవని అంతే అడిగాను. . .' ఇంతలో దూరంగా బీచిలోంచి నడిచి వచ్చే, పహిల్వాన్ లాంటి వాడి ఆకారాన్ని చూసి ఆత్రతగా లేచి నిలబడి, 'ఇష్! వాడొస్తే నా సంగతి ఏమీ చెప్పకండి. వాడు వెళ్ళిపోగానే తిరిగి వచ్చేస్తాను. దయచేసి ఎదురు చూస్తూ ఉంటారు కదూ? నన్ను డిసప్పాయింట్ చెయ్యరు కదూ?' అని మాట్లాడుతూనే క్షణమరు గయిం దామె. దేవతలా మాయమయిం దను కున్నాడు రవి. కాదు, కాదు. దయ్యంలా మాయ మయిందని మనస్సు మెల్లగా చెప్పబోయింది. ఏదో ఒకటిలే, బతుకు జీవుడా! అనుకుంటూ తన తోవ్వన పడ్డాడు రవి. ఆలస్యం గాక ఉంటే మళ్ళీ ఆ సుందరి తగులుకుంటుందేమో అన్న భయం రవిని మరింత వేగంగా జనసమ్మర్దంలో మాయమయేటట్లు చేసింది.

వడివడిగా నడిచి, నడక వేగాన్ని తగ్గించేటప్పు డనుకున్నాడు రవి. 'ఆ అందం వెనక ఎంతటి విషాద గాథ ఉంది! సినిమా వ్యామోహంలో దగా పడ్డ వనిత జీవితం ఎంత నికృష్టమయింది! ఘరానాగా కనిపించి మగాడి బలహీనతను లొంగ దీసుకుని, కాసు రూపంగా ప్రతిఫలాన్ని అందుకోవాలనే ఆత్రత. దొరికిందో, లేదో తెలుసుకునే లోపలే యమ కింకరుడి ప్రత్యక్షంతో పారిపోయినా, తనకు తెలుసు—ఆమె తన కోసం తప్పక వచ్చి వెతుకుతుందని.

పోతేపోనీ, ఆ అందాన్ని తన స్వంతం చేసుకోవలసింది తాత్కాలికంగా నయినా. ఒంటిలోని నరాలు జిల్లు మన్నాయి. కోరిక ఉన్నా, అంతటి తెగింపు లేని తనకు కోరిక లేకున్నా బాగుండును. అసమర్థుడికే ఎక్కడా లేని కోరికలని తనని తానే నిందించుకున్నాడు రవి.

'ఛీ ఛీ,! తాత్కాలికంగా కాదు. ఆ నవ్వు, ఆ కళ్ళు, ఆ అందం—ఓ హ్! ఒక్కటేమిటి? తనివి చూసిన తరవాత నా కేం అనిపించింది? ఆ అమాయకత్వం, ఆ సొగసు. పిండు వెన్నెలలో సెలయేరు వీరాదుగా ప్రసరించే పిల్ల వాయువులు సెలయేరు లోని అలలతో సరిపే నాట్య విన్యాసానికి తోడుగా తాళం వేస్తూ ఉంటే దాన్ని చూసిన వారి మనస్సు ఏ విధంగా పులకరిస్తుందో. తెరలు తెరలుగా ఆమె అలానే నవ్వుతూ ఉంటే ఆ నవ్వు తన మనస్సు నుత్తేజ పరిచింది. అంతేకాక, తనపై మత్తు మందు చల్లిన ఆ చిరునవ్వును శాశ్వతంగా తానెందుకు స్వంతం చేసుకో కూడదూ? [illegible] భాగస్వామిగా తనెందుకు ప్రవేశించ [illegible]? అలానే జరిగితే ఈ జన్మ సార్థకమౌతుంది.

తను తాత్కాలికంగా ఉద్రేకపడినా, అసలు జరుగుతున్న దేమిటి. జరిగిం దేమిటి. . .

ఆ సంఘటన ఇతివృత్తంగా వెంటనే ఒక కథ, వీలయితే నవల వ్రాసి పారేయాలనుకుని, రైల్లో బోలెడు తీరిక లభించగానే ప్రారంభించాలని తను తీరా కలగని బయలు దేరితే, జరుగుతున్న దేమిటి? అనుకుని విట్టూర్చి, నిస్సహాయత కోపంగా మారితే, పైకి కనిపించనీయకుండా వడివడిగా దూరంగా టిక్కెట్లు చెక్ చేసే కండక్టరు దగ్గరకు పోయి ఒక నిమిషం సేపు ఏదో సీరియస్‌గా చర్చించి, అతడు ససేమిరా వీలు కాదన్నట్లుగా తల ఊపగానే, ఉసూరుమంటూ కాళ్ళీడ్చుకుని, మరింక చేయటానికి మిగలలేదన్నట్లుగా చతికిల బడగానే రాధ అందుకుంది:


యద్దనపూడి సులోచనారాణి
ప్రేమలేఖలు నవల ......రు 12-00
కావిలిపాటి విజయలక్ష్మి నవలలు
{ చక్రపాణి.......రు 9-00
తృప్తి........రు 6-50
గోవిందరాజు సీతాదేవి నవల సన్మానం.... రు 6-00
3 రూ. M.O. పంపిన పోస్టు ఖర్చులు ఉచితం. V.P. పద్ధతి లేదు.
క్వాలిటీ పబ్లిషర్సు* రామమందిరం వీధి, విజయవాడ-2

'సారీ, రవిగారూ! మిమ్మల్ని చాలా ఇబ్బంది పెట్టేస్తున్నామని కాబోలు బెర్తు మార్చుకుండా మని మీరు చేసిన ప్రయత్నం బహుశా ఫలించినట్లు లేదు. ఓకే! మా వల్ల మీకే ఇబ్బంది రాదు. ఫ్రీగా ఇకనయినా ఉండండి.' నోరు విప్పదీసుకుని తన వైపే చూస్తూండే రవిని చూస్తూనే రాధ సంభాషణ సాగించింది.

'ఏయ్, ఫ్రెండ్స్! ఇటు చూడండి. రవి తత్త్వమే అంత. తనని చూసి చాలా సంవత్సరాలయినా, నా కింకా చిన్ననాటి సంగతు లెన్ని జ్ఞాపకం ఉన్నాయో తెలుసా? ఈయనగారికి ఆడపిల్ల లంటే చిన్నప్పటినుంచి భయం. గుండె దడ. ఇప్పుడు కొంచెం నయంగానే కనిపిస్తున్నా, ఆ అలవాటు పూర్తిగా మారిపోయిన సూచన లేమీ లేవు కాబట్టి మీ రంతా నిశ్శబ్దంగా మీ పనులు మీరు చూసుకుని, ఆయన్ని ఆయన మానాన వదిలి పెట్టేయమన్నా ఓ రిక్వెస్టు. . . లేకపోతేనా?' ఏమన్నట్లుగా చూసిన స్నేహితురాళ్ళ వైపు చూస్తూ అంది రాధ: 'మన మెంత చెడ్డాళ్ళమో వర్ణిస్తూ ఒక కథ రాసి పారేస్తాడు.'

అంతా సరే నన్నారు. తన పరిచయం కొత్తది కాకపోవటంవల్ల తను మాత్రమే రవితో మాట్లాడుతూ ఉంటా నన్న దానికి మరెవ్వరూ అభ్యంతరం చెప్ప లేదు. ముసిముసి నవ్వులతో ఎవరి వ్యాపకాల్లో వాళ్ళు నిమగ్న మయ్యే టప్పటికి రవికి రాధ మీద గౌరవం ఏర్పడ్డింది. మనస్సుకూడా కుదుట పడిం దనే చెప్పాలి.

'అయితే, ఈ పదేళ్ళు హైదరాబాదు లోనే చదువు పూర్తి చేశారా? లేక మరెక్కడయినా. . .'

'ఉహూ! అంతటి అవసరం కలగనే లేదండీ. అన్నయ్యకు ఒక చోట నుంచి మరో చోటుకి వెళ్ళవలసిన అవసరం లేని ఉద్యోగం కావటంతో ట్రాన్స్‌ఫరుకు అవకాశమే లేదు కాబట్టి, అన్నయ్య దగ్గరే ఉంటూ స్టడీస్ పూర్తి చేశాను.' ఏ సంగతే మన్నట్లుగా రాధ వైపు చూడగానే అర్థమయిం దానిలాగ రాధ— 'నాన్నగారికి హైదరాబాదు నుంచి మద్రాసు ట్రాన్స్‌ఫర్ అయిన ఆరేళ్ళ వరకు ఇంట్లోనే ఉంటూ చదువు కున్నాను. ఆయన కోయంబత్తూరుకు మారిపోగానే మద్రాసు లోనే—అంటే 'కళాక్షేత్ర' హాస్టల్లో ఉంటూ డిగ్రీ కోర్సు పూర్తి చేశాను.

నా సబ్జెక్ట్ డాన్స్ లెండి. ప్రస్తుతం పోస్టు—గ్రాడ్యుయేషను చేస్తున్నాను. కళాక్షేత్ర, హైదరాబాదు రవీంద్ర భారతిలో ఏకాయేకి ఓ వారం రోజులకు ప్రోగ్రామ్ ఏర్పాటు చేస్తే మా కాలేజీ నుంచి సుమారు ముప్పై మంది ఆ ప్రోగ్రామ్‌లో పాల్గొనే నిమిత్తం బయలు దేరాం. మా ట్రూపులోని చాలా మంది నిన్ననే బయలు దేరారు. ఈ రోజున మే మయిదుగురం, రేపు మరో ఇద్దరు బయలుదేరి ఎల్లుండి కల్లా హైదరాబాదులో అందరూ చేరుకుంటారు' అంది.

'ఆహా. పెద్ద ప్రోగ్రామేనే! వారం రోజు లుంటారా హైదరాబాదులో!' ఏదో ఉత్సాహంతో అడుగుతూ ఉంటే— 'ఏం, ఉండ వద్దంటారా? అన్నారంటే



వయ్యారం చిత్రం— వేణు ( గెడ్డనపల్లి )

రేపే తిరుగు ప్రయాణం కట్టేస్తాం.' నల్ల పిల్ల మధ్యలో అందుకుంది.

'ఒసే, వనజా! ఇప్పుడేనా చెప్పేంది— నోరు మూసుకోమని?' కసురుకోకుండానే మందలించే స్వరంతో రాధ అనే సరికి, మూతి తిప్పు కుంటూ పక్కనున్న పొట్టి పిల్ల చేతిలోంచి పుస్తకం లాక్కుని సీరియస్‌గా చూడటం మొదలెట్టింది.

'అన్నట్లు మరిచే పోయాను. వీళ్ళ నెవర్నీ పరిచయమే చేయలేదు కదూ? క్షమించాలి. ఓయ్, ఫ్రెండ్స్! ఏదీ, ఒక్క నిమిషం. ఇది వనజ. అది ఆండాళ్ళు. పోతే అది సుమ. . . ఆ. . .ఆ ఇంక పోతే. . . సుమీ! లత ఏదే?' మాటల సందర్భంలో బాత్‌రూమ్‌లోకి జారు కున్న లతని గమనించనేలే దిద్దరూ.

'బాత్‌రూమ్‌లో పరిచయం చేయటం బాగుండదు కదండీ? వచ్చిన వరకు ఓపిక పట్టే బదులు, దాని పేరు లత అని చెప్పేస్తాను. అది రాగానే హలో అనే యండి!' కిసుక్కున నవ్వేశారు అంతా ఒక్కసారే. రవి పెదాల మధ్య మొదటి సారిగా చిరునవ్వు వెలిసింది. ఆ నవ్వుని గమనించిన రాధ గర్వంగా ఇతరుల వైపు చూసింది. రవిలో భయం మెల్ల మెల్లగా జారుకుంటున్నట్లు ఫీలయింది రాధ.

'ఇంతకీ మీరు మద్రాసు సెందు కొచ్చినట్లో చెప్పనే లేదు మరి?' ఉన్న ట్టుండి ఇంకేదో జ్ఞాపకం వచ్చినదానిలా పోజు పెట్టి మరీ అడిగింది రాధ, రవిని.

'చెప్పుకోతగ్గ విశేష మేమీలేదు లెండి. నిరుద్యోగ పర్వతంలో ఒక ఘట్టం. ఏదో ఇంటర్వ్యూ అని ఇంటిమేష నొచ్చింది. నాకు కార్డు చేరే లోపలే ఆ ఉద్యోగం దక్కవలసిన వాళ్ళెవరో నిర్ణయమయి పోయి ఉంటుందని నా అనుభవంవల్ల తెలుసుకున్నా, ఇంటి దగ్గరుండి చేసే దేమీ లేక దారి ఖర్చుల్ని సమకూర్చి పెట్టే స్తోమతు గల అన్నయ్యల దయ, ప్రోత్సాహం ఉండటం వల్ల ఇంటర్వ్యూ లంటూ దేశంలో అనేక ప్రాంతాలు తిరిగి రావటం పరిపాటయి పోయింది. ఇకపోతే మద్రాసు సంటారా? వీటన్నిటినీ మించి ఒక రకంగా బంధు వయినా, బంధుత్వం కంటే ఎక్కువగా కనిపించే స్నేహం రోజు రోజుకి ఎక్కువవుతూ ఉన్నా చూసే అవకాశం ఎప్పుడో చిక్కదు కాబట్టి అసలు వాడిని చూడచ్చు కదా అనుకుని వెళ్ళటం జరిగింది. మద్రాసులో మా చిన్నాయన కొడుకు ఇంజనీరుగా ఉంటున్నాడు. అన్నట్లు మీరు వాడిని చూసే ఉంటా రనుకుంటా?'

'అంత పెద్ద సిటీలో మీ చిన్నాయన కొడు కెవరో నా కెలా తెలుస్తుందండీ? . . .' మాట ఆపే లోపలే, బాత్‌రూమ్ లోంచి వచ్చిన లత కిసుక్కుమని నవ్వింది. రవి లతని చూసి, 'నమస్కారం' అన్నాడు. ఈసారి ఆశ్చర్య పోవడం లత వంతు అయింది. 'లతా! నీ విక్కడ లేనప్పుడు నీ పరిచయం జరిగిందిలే. బహుశా అందుకనేమో. . .?' వనజ కలగ జేసుకుంది.

రాధ ఉరిమి చూడగానే ఇద్దరూ కిక్కురు మనలేదు. రాధ వీళ్ళ నందర్నీ కంట్రోల్‌లో పెడుతూ ఉండే అను కున్నాడు రవి.

'అబ్బెబ్బే! పొరపాటు పడ్డారు. మద్రాసు సంగతి కాదండీ నే నదేది. హైదరాబాదులో మీరు ఉండే రోజుల నాటి మాట. అదేలెండి... మీరు మా ఇంటి పక్కన ఉన్న రోజుల్లోని మాట. అప్పుడు చూసే ఉంటా రనుకుంటాను. బలంగా, ఎత్తుగా, ఎర్రగా. . .'


'అంటే గున్న ఏనుగు లాగనా?' పొట్టి పిల్ల ఆండాళ్ళు అందుకుంది.

'కాదే. .. అచ్చం నీ లాగ' అని రాధ అనగానే ఏ మూడ్‌లో ఉన్నాడో కాని రవి— 'కరెక్ట్' అని అన్నాడు. ''ఫరవాలేదే! ఇంత మాత్రంకూడానూ!'' అందరూ ఆశ్చర్యం గానే చూశారు.

'కాని ఇప్పుడు వాడిని. . . అంటే విస్సుగాడిని చూశారంటే మీరే ఆశ్చర్యపోతారు. సన్నగా, నల్లగా, గడ కర్రలా ఉంటాడు. విస్సుగా డున్నాడు కదా అని రెండు రోజులు ముందే మద్రాసు చేరుకున్నాను. ఇంటర్వ్యూముగిసిన రెండు రోజుల తరవాత కాని మద్రాసు నుంచి బయలుదేరలేదు మరి.'

'ఉద్యోగం వచ్చినట్లేనా?' ఏదో తెలుసుకోవాలన్న కోరిక రాధలో ఉరక లేస్తూంది.

'భలే వారండీ మీరు. . . భలే జోకు వేశారనుకోండి. ఈ కాలంలో ఉద్యోగం రావాలంటే ఇంటర్వ్యూల వరకు పోనవస రం లేదండి. ఉద్యోగం ఎవరికో భాయం




చేసిన తరవాతనే ఇలాంటి తతంగాన్ని జరిపించి, ఆ అదృష్ట వంతుడికి దానం చేసిన ఉద్యోగానికి, సక్రమ మయిన మార్గం లోనే సెలక్షను జరిగిందని రికార్డుల్లో చూపించటానికి ఇవన్నీ గాని, మరింకేదానికి కాదండీ. ఈ ఆటలో నా లాంటి వా ళ్ళందరూ యజ్ఞ పశువులే మరి.'

'ఫరవాలేదు. రవిగారుకూడా ఆవేశం గానే మాట్లాడతారే!' ఈ సారి సుమ వంతయింది నోరు విప్పటం. పాపం, రవి అమాంతంగా సిగ్గు పడ్డాడు. రాధ ముఖంలో ఆత్రత వెంటనే కనిపించింది. 'మరింకేమి టనుకున్నారోయ్, ఫ్రెండ్స్? తను రచయిత కదా? ఆమాత్రం ఆవేశం రాకపోతే కథ లెలా రాస్తారు? అన్నట్టు. . .' ఏదో దీర్ఘంగా ఆలోచిస్తు న్నట్టు గంభీరంగా పోజు పెట్టి అంది: 'అయిదారు వారాల బట్టి 'ఆంధ్రప్రభ'లో ప్రచురించబడే 'అన్వేషణ' మీరు కాదు కదా రాస్తోంది? సుమా! నిన్ననే—ఆ రచయిత పేరేమి టే? నాకు జ్ఞాపకం రానంటోంది.' తడుము కోకుండా సుమ 'రవి' అని ఊరుకుంది. ప్రారంభం లోనే, ఈ అయిదు మంది అమ్మాయిల్నే కాకుండా కాలేజీలో చాలా మందిని ఆకట్టుకున్న సీరియల్ నవల 'అన్వేషణ' వ్రాసింది తనే నంటాడేమో నని ఎదురు చూడటం ప్రారంభించారు అంతా.

సిగ్గుపడుతూనే తల దించుకుని, అవునన్నట్టుగా తల ఊపాడు రవి. 'కంగ్రాట్స్! కావ్‌గా ఉండే రవిగారూ! సారీ, సారీ, రవిగారూ, చెప్పరా? ప్లీజ్, చెప్పరా—చివరికి అరుణ ప్రేమని శరత్ గుర్తిస్తాడా? వాళ్ళిద్దరికీ పెళ్ళవు తుందా?' అంది. ఏం చెప్పాలో, ఎలా ప్రారంభించాలో అర్థంకాక అలానే చూసే రవి వైపు రాధ మొదలు నిగతా నలుగురు కూడా గుడ్లప్పగించి అలా చూడటం మొదలెట్టారు, ఏం చెపుతాడా అని.

'చాలా ఉత్సాహంతో మీరంతా అడి గారు. కథకుడుగా నా మనస్సు సంతో షంతో గంతులు వేస్తూ ఉంది. ఒక కళాకారుడు తన కళను ఇతరులు మెచ్చు కున్న క్షణాన పొంగిపోతాడు. తన తపస్సు ఫలించిందని తృప్తి పడతాడు. బహుశా నేను రాసిన అనేక కథల్ని మీరు చదివారో, లేదో నాకు తెలియదు. అయినా, నా 'అన్వేషణ' లోని పాత్రలు మీకు నచ్చాయని తెలుసుకున్న తర్వాత నాకేం చెప్పాలో అర్థంకావటం లేదు ...' కొంచెం సేపు ఏదో ఆలోచించి, 'కొన్ని వారాలు ఓపికపట్టి ఆ నవలను చదవటం పూర్తి చేస్తే మీకే అన్ని విషయాలు తెలిసి పోతాయిగా? ముగింపు తెలుసుకుంటే బహుశా నవలలో పటుత్వం తగ్గిపోతుం దేమో? మీరు చదవబోయే సంచికలోని కథ చదువుతూ ఉంటే ...' ఇది చెపు తున్న ప్రతి క్షణం రచయితగా గుర్తింప బడ్డానే అనే కొత్త గర్వం రవిలో స్పష్టంగా తొంగిచూసింది.

'నో, నో! అదేం కుదరదు. పెళ్ళి జరుగుతుందని నేను, జరగదని రాధ పందెం వేసుకున్నాం. చివరికంటా వేచి ఉండి, మా పందెం ఏమవుతుందో నని వేచి చూసే బదులు, ఇప్పుడే తేల్చేసుకుంటే ఏం బాగుంటుంది?' సుమ ఆపివేయగానే ఆండాళ్ళు అందు కుంది. 'రచయిత మా ఎదురుగా ఉండగా, పైగా ఆయన మా రాధకు బాల్య స్నేహితుడవటంతోబాటు, రాధే పందెంలో ఒక పార్టీ అయినప్పుడు ... ప్లీజ్! మమ్మల్ని సస్పెన్సులో ముంచి వేయటం భావ్యంకాదు. అందుకని ముగిం పెలా ఉంటుందో చెప్పేయరూ? ఏం, రాధా?'

'అదే కాకుండా పెళ్ళి జరగనిపక్షంలో అరుణ చచ్చిపోతుందని సుమ, లేదు, పరిస్థితుల కెప్పటికీ స్త్రీ బానిసే కాబట్టి తన కిష్టమున్నా, లేకపోయినా ఇంకెవరి నయినా పెళ్ళి చేసుకుంటుందని కూడా మేము వాదించుకున్నాము. అయితే, ఈ ఏస్పెక్ట్‌లో పందెం లేదనుకోండి ...' ఇక మీకు తప్పదన్నట్టు రాధ కూడా అడిగి, ఆత్రతగా రవి ఏం చెపుతాడో అని తనవైపే కన్నార్పకుండా గమనిం చడం చూసిన రవి తన కళ్ళు క్రిందకు దించేసుకోగానే, 'బీచిలో సుందరి' అప్ర యత్నంగా కళ్ళ ముందు నిలిచింది. రవికి చిరాకేసింది. 'ఛీ ఛీ! త నెక్కడ, రా ధెక్కడ? నక్కకీ, నాగలోకానికీ ఉన్నంత తేడా ఉంది!' ఆమె రూపం మాయమవగానే రాధను చూడటానికి సిగ్గేసింది. ఏదో అసహాయత. తీరా చూడగానే ఏదో ఒక ఆప్యాయత తనని రాధ దగ్గరకు తీసుకు వెళ్ళుతున్నట్టు ఫీలయ్యాడు రవి.

వెంటనే రాధవైపు గోముగా చూసి, 'రాధగారు సరిగ్గా ఆలోచించారని చెప్ప టానికి గర్విస్తున్నాను. అరుణ తన ప్రేమని వ్యక్తం చేసినా. పరిస్థితుల ప్రభావానికి శరత్ తట్టుకోలేడు. అదీ కాకుండా సుమ గారు ఊహించిన విధంగా అరుణ చచ్చిపోదు. పరిస్థితుల ప్రభావానికి దాసోహమని వేరొకరిని వివాహం చేసుకో వలసి వస్తుంది' అన్నాడుంది.

'ఓ... నో! అయితే, ట్రాజెడీ అన్న మాట!' ఓడిపోయానన్న నిరుత్సాహం కంటే, నవల ట్రాజెడీగా ముగుస్తుందనే బాధ ఎక్కువగా కనిపించిం దామెలో. 'నే చెప్పా, లేదా? చూశావా ఏమ [illegible] విజయ గర్వం తొంగి చూసింది [illegible]

'[illegible]క్షమించాలి, నే నో కొత్త [illegible]ప్రయోగం చేస్తు న్నందుకు—[illegible]అనేది ఇంగ్లీ షులో ఉంది [illegible] పదం ఉన్నట్లయితే నా నవలకు [illegible] ఖచ్చిత మయిన వర్ణన అనిపించుకుంటుంది [illegible]. పెళ్ళి చేసుకోవాలనుకున్న శరత్ తనకు దక్కకపోయినా, తనంటే పడి చచ్చే చంద్రబాబుని పెళ్ళి చేసుకుంటుంది, పెద్దల ఒత్తిడి ముఖ్యకారణం కాగా. తననే ఏ నాటికయినా పొందాలని, అరుణ శాశ్వతంగా తన దయినప్పుడే తన జీవితం పరిణతి చెందుతుందని వేయి కలలు కన్న చంద్రబాబుకి ముగింపు సుఖాంతం. తాత్కాలికంగా శరత్‌ని పొంద లేక పోయానే అన్న దిగులు అరుణను క్రుంగదీసినా, తన విషయంలో కథ ముగింపు ట్రాజెడీయే అయినా ఈ కథ తర్వాత ఎలా ఉంటుందో మీరే రచయి త్రులుగా ఊహించుకుంటే, కథ దుఃఖాం తంగా ముగిసినా, తాను తన ప్రాణం కన్నా ఎక్కువగా తనను ప్రేమించి ఆరాధించే తన భర్త సమక్షంలో, అంటే చంద్రబాబు సాన్నిహిత్యంలో తన గత జీవితమంతా ఒక పీడ కలగా మరిచిపోయి కొత్త జీవితాన్ని, ఆ జీవితం సమకూర్చే స్వర్గ నరకాల్ని చవిచూస్తుంది కాబట్టి అరుణ జీవితం ట్రాజీ కామెడీ అన్న మాట...' మెల్లగా, మొట్టమొదటిసారిగా ఈ కొద్ది క్షణాల పూర్వం వరకు రవిలో ఎంతటి మార్పు వచ్చిందో తెలియజెప్పే టట్లుగా, ధైర్యాన్ని పుంజుకుని లెక్చరిచ్చే రవిని అదేపనిగా చూస్తూ కూర్చుండి పోయిం, మరి ఇంక ముందుకు సాగలేక పోయారు వాళ్ళంతా.

రైలు ఆగుతూ, కదులుతూ వేగం గానే పరుగిడుతూ ఉంది. స్టేషనుకాని చోట, ఆగరాని చోట అప్పుడప్పుడు ఆగుతూ ఎందుకు బయలుదేరుతుందో అర్థంకాని దూరంగా కూర్చున్న విద్యార్థి సతమతమవుతూ ఉన్నా, మాటల్లోపడ్డ ఈ బృందానికి ఆవేమీ తెలియటంలేదు. చిన్న చిన్న స్టేషన్లతోబాటు గూడూరు, నెల్లూరు మొదలైన పట్టణాలు కను మరుగయి పోయాయి. ఒంగోలులో భోజనా లయిపించా యిపించి, మెల్లగా

ఒకరి తర్వాత మరొకరు నిద్రకు ఉపక్రమించారు.

పై బెర్తుకి మార్చుకున్న రవికి ఎదురుగుండా ఉన్న పై బెర్తు పై రాధ పడుకుంది. చాలా మంది నిద్ర పోయారు. కొంతమంది గురకలుకూడా పెడుతూ ఉన్నా, వీరిద్దరి పడుము నిద్రా దేవి రావటానికే భయపడింది. అందువల్ల నిద్రకు ఉపక్రమించిన వారికి నిద్రా భంగం కలగకుండా మెల్లగా గుసగుసలు ప్రారంభించారు. చిన్ననాటి కబుర్లు, విశేషాలు ముఖ్యంగా సంభాషణను నింపి వేశాయి. పాత విషయాలు మాట్లాడుకుని నవ్వుకున్నారు. గేలి చేసుకున్నారు. గుర్తు చేసుకున్నారు. చిన్ననాటి ముచ్చట్లతోనే సంభాషణ ఆగలేదు. సాహిత్యం దగ్గరి నుంచి రాజకీయాల వరకు, వంటింటి కబుర్ల మొదలు వా రిద్దరికి తెలిసిన వారింటి కబుర్లవరకు ... ఇవే కాక ... సినిమాలు, వాటిలోనూ హిందీ, ఇంగ్లీషు సినిమాల సంగతి ఆసక్తితో మాట్లాడుకున్నారు. తెలుగు సినిమాలు చెత్త అన్నాడు రవి. ఏ రెండింటిని చూసినా ఒకటే విధంగా ఉంటాయన్నాడు. సినిమా అంతా కత్తి యుద్ధాలు, అసభ్య దృశ్యాలు, అనవసరపు పాటలు, సన్నివేశాలతోబాటు, పీటి వల్ల సంసారాలు చితికిపోయి చివరి సీనులో ఒకటి కావటం వల్ల ఆ సినిమాలు చెత్త అని చెప్పాడు. రాధ ఒప్పుకోలేదు. అవి బాగుంటాయంది. పైగా డైలాగ్స్ ఎక్సలెంట్ అంది. ఆత్రేయ గారి మాటలు, ఆరుద్రగారి పాటలు వండర్‌ఫుల్ అని ఇంగ్లీషులోనే చెప్పింది. వెంటనే రవి అభిప్రాయాన్ని మార్చేసుకున్నా, తెలుగు సినిమాలు బెస్టు అని ఒప్పేసుకున్నాడు. ఏ స్టేజివరకు వెళ్ళాడంటే, అనేకులు ఉత్తమ కళాకారులు ఎన్నో కళాఖండాలు సృష్టించినా కనీసం ఆస్కార్ రాకపోవటం అన్యాయమని గట్టిగానే చెప్పేశాడు. బహుశా ఆ న్యాయ నిర్ణేతలకు తెలుగు రాకపోవటం వల్ల, తెలుగు సంప్రదాయాలు అర్థం కాకపోవడం వల్లనే ఆ ప్రైజ్ రాలేదని తేల్చి చెప్పేశాడు.

హైదరాబాదులో తను ఉన్నన్ని రోజులు ఎన్నిసార్లు వీలయితే అన్నిసార్లు వచ్చి చూచిపోవాలని అర్థించింది రాధ. సంతోషంగాఒప్పుకున్నాడురవి. ప్రోగ్రామ్ ఉన్న వారం రోజులూ తప్పకుండా హాజరవాలి. ముఖ్యంగా రాధ ఏ రోజు అయినా ప్రోగ్రామ్‌లో ఉంటే తప్పని సరిగా ఉండి తీరాలి. అంటే విధిగా రవికి రవీంద్ర భారతికి హాజరు తప్పదు. శాస్త్రీయ సంగీత మన్నా, నృత్యశాస్త్ర మన్నా చిన్న మెత్తు జ్ఞానం లేని రవి, రాధ కోరిన వన్నిటికీ ఒప్పేసుకున్నాడు. తనకూ చిన్న చిన్న కోరిక లున్నా—అంటే తనతో రాధ హోటలుకి వచ్చి ఏదైనా తినాలనో, పార్కులన్నిటినీ సర్వే చేయాలనో, సినిమా హాల్లో పక్క పక్కగా కూర్చుని సినిమా చూడాలనో ఇటువంటి పగటు కోరికలు రవికి లేకపోలేదు. కాని, ముందుకే మోనం వస్తుందని తన కోరికల్ని వెలిబుచ్చకుండానే ఆమె చెప్పిన వాటి కన్నింటికి వెంటనే ఒప్పేసుకున్నాడు రవి.

నిమిషాలు గంట లయినాయి ... అర్ధ రాత్రి దాటి తెల్లవారుఝాము సమీపించ బోయింది. రైలు ఖాజీపేట దాటగానే ఎప్పుడూ నిద్ర కాగలేని రాధ, క్షమించమంటూ ఒక కునుకు తియ్యటానికి ఉపక్రమించింది. నిద్ర పట్టే లోపల, కళ్ళు మూసుకుని రవితో మాటలు ఆపివేసిందన్న మాటే గాని—''బహుశా ఈ కలయిక కాకతాళీయం కాదేమో? లేకపోతే తను చిన్నప్పుడు ఎంతగానో ఇష్టపడ్డ రవిని ఈ రోజున ఎందుకు చూడాలి? అన అటువంటి పరిస్థితి మళ్ళీ వస్తుందని తను కనీసం కలయినా కనలేదు. రవికి జ్ఞాపకం రాకపోయినా, తనంతటే తనే అన్ని విషయాలూ జ్ఞప్తికి వచ్చేటట్లు చేసింది. దేవుడి దయవల్ల అతనికి కూడా చిన్న నాటి విషయాలు చాలా వరకు గుర్తున్నాయి. వాటిని మరిచిపోలేదని మాటల సందర్భంలో ఇప్పుడే తెలిపింది. తనంటే రవికి కూడా ఎంతో ఇష్టమున్నట్లుగానే అతని ప్రవర్తన వల్ల తెలుతూ ఉంది. ఆడ పిల్లంటే తప్పుకుపోయో, పారిపోయో, మూగగా మాటామంతీ లేకుండా కాలం వెళ్ళబుచ్చే నెట్టుకొచ్చే రవి తనతో అంత బాగా మాట్లాడగలిగాడంటే ... అవును, తప్పకుండా అతనికి తన దగ్గర చనువుఉంది... అతనికి తనంటే ఇష్టం... ష్యూర్! నాకు బాగా నమ్మకం ... నా అనుమానం మీాద నాకు నమ్మకం ... 'రవి లవ్స్ మి'' ... ఎక్కడలేని సిగ్గు రావటంతో రెండు చేతులతో ముఖాన్ని కప్పేసుకుని సిగ్గుపడిపోయింది రాధ. మరికొంత సేపటికి తీపి కలల మధ్య మగతగా నిద్ర పట్టేసింది.

ఎదురుగా ఉన్న రవి పరిస్థితి దాదాపు అలాగే ఉంది.

చలనంలేని ఆమె శరీరాన్ని, క్రమమైన ఉచ్ఛ్వాస నిశ్వాసాలను చూస్తూ అనుకొన్నాడు రవి: 'ఎలా నిద్రపట్టింది నీకు, రాధా? అదృష్టవంతురాలివి. నాకు నిద్ర ప్రాప్తిలేదు. పోనీలే. ఈ రెండు గంటలు నిద్రలేకపోవటం మహా కష్టమేమీ కాదు. రేపు ఏమవుతుందో, ఏమో! ఈ రోజు కయినా తనివితీరా నిన్ను చూసుకోనీ.

సింగినాథం ... ఏమవుతుంది? ఏమీ కాదు. అదే, అదే. తనకి దూరం కాదు.

చిన్నప్పటి నుంచి తనంటే రాధకు తగని పిచ్చి. ఆ ఇష్టం వల్లనే తనతో తిరిగి సన్నిహితురాలైన ఒకానొక ఆడ పిల్ల. ఉద్యోగరీత్యా తన తండ్రి మద్రాసు వెళ్ళి స్థిరపడినా, వెళ్ళే రోజు తను మిగిల్చి పోయిన బాధ, కంటనీరు, వారిరువురి మధ్య జరుగుతుండే ఉత్తర ప్రత్యుత్తరాలలో కనిపిస్తూనే ఉండేవి కొన్ని రోజులు. ఉత్తరాలు క్రమేపీ సన్నగిల్లుతూ వచ్చి కొన్ని సంవత్సరాలతర్వాత పూర్తిగా ఆగిపోయాయి. ఉత్తరాలతో బాటు తను క్రమేపీ రాధను మరిచి పోయాడు. ఏదో మసక మసకగా తప్పించి, స్పష్టంగా రాధ ఎలా ఉంటుందో కూడా ఊహించుకోలేని తనకు కనీసం మద్రాసు వెళ్ళేటప్పుడయినా రాధ అక్కడే ఉంటుందన్న ఊహే రాలేదు. ఎన్నో సంవత్సరాల తర్వాత ఒకరి కొకరు కలియడం కేవలం యాదృచ్ఛికం కాకపోవచ్చు.

ఒక వేళ దేవుని ఉద్దేశం మరోలా ఉందేమో? రాధ శాశ్వతంగా తన అర్ధాంగిగా, గుండెలో చోటు చేసుకుని నివసించే రోజు త్వరలో రానున్నదేమో?

ఎదురుగా నిద్రపోతున్న రాధ వైపు అలా చూస్తూ ఉండిపోయాడు రవి. ''ఆ చిరునవ్వు శాశ్వతంగా తనది కాకూడదూ? ఆ నవ్వుల పెదాలపై పెదవులను సుతిమెత్తగా ఆనించి తను అలానే ఉండిపోకూడదూ?'' ఉద్రేకం ఉప్పెనలా


బుచ్చిబాబు (సినీ) బయోగ్రఫీ
(బొమ్మలకథ)
రచన: శశిధర్
8-9-76 సంచికలో ప్రారంభం

మంచం మీద పరుపుపై పడి ధ్వంసం కాకుండా మిగిలింది.

ఆ సాయంత్రం వెన్నెలకోసం ఎదురు చూసే చకోర పక్షిలా వేచి ఉంది రాధ. అప్పటికే ఎన్నో రోజులు గతంలో కలిసి పోయినట్లు తనివి తీరేటట్లుగా ఒకరి వైపు మరొకరు రెప్పలార్పకుండా అలానే చూసుకుంటూ కొంతసేపు గడిపారు. పెదాలు కదలవు ... కళ్ళ రెప్పలు బాసలు చేసుకుంటాయి. మనస్సు మూగది. కాని, అప్పుడప్పుడు తన ఎదుట మనస్సు కర్తమయ్యేలా ఏదో చెప్పుతుంది. విజిటింగ్ సమయం పూర్తయినంతవరకు అక్కడే ఉండి, తప్పదు కాబట్టి బయలుదేరాడు రవి.

మద్రాసులో ఆ సాయంత్రం మొదలు హైదరాబాదులో వారి తిరుగుడు ఎందుకూ, ఏ విధంగానూ సరితూగదని తేలిపోయింది. వీలయినప్పుడల్లా ఎక్కడో ఒక చోట ఎలాగోలా కలుసుకుంటూనే ఉన్నారిద్దరూ. బీచి, పార్కులు, హోటల్స్, సినిమా హాళ్ళు... ఓహ్ ... ఒక్కటేమిటి ... మద్రాసులో ఉన్న ప్రతి చోటు వీరి పవిత్ర ప్రేమతో పునీతమయింది.

ఒక రోజు —

"రాధీ!"

"ఊఁ" అంది మత్తుగా.

"ఎన్నినాళ్ళిలా, అందరి కళ్ళలో నానుతూ దృష్టిదోషం తగిలించుకుంటూ ఉంటాం?"

"ఏం, బాగాలేదా? నీ కంత కష్టమయితే నే నింక మీదట బయటికే రానులే."


భయపడిపోయాడు రవి. వెంటనే తమాయించుకొని అన్నాడు: "అదికాదు, రాధా! ఈ అనుబంధం శాశ్వతంగా ఉండిపోవాలని నీ కనిపించదూ? ఈ తిరుగుళ్ళకు, ఈ బాంధవ్యానికి మరో రూపు సంతరింప చేయాలని నువ్వు ఊహించవూ? అందుకే అంటాను, రాధీ, ఇక చాలవా ఈ తిరుగుళ్ళు ..." మాట తుంచేస్తూ రాధ అందుకుంది:

'ఏమిటి నువ్వనేది? నీ కిప్పుడే విసుగెత్తిందా! ఛీఛీ! నేనే పొరపాటు పడ్డాను. ఎంతయినా మీది మగబుద్ధి. ఆసక్తి అణగారిపోగానే చాలనుకుంటారు. రవీ! పొరపాటు పడ్డాను. అన్ని విషయాల్లా, సామాన్యమైన దానిగా దీన్ని కూడా తీసి పారేస్తావని నే ననుకోలేదు.' పైకి లేచి వెళ్ళబోయిన రాధను, చెయ్యి పట్టి గుంజి బలవంతంగా కూర్చోబెట్టి, 'ఓ యు బోర్! నే చెప్పేది నీ కర్థం కానట్లు ఇదో నటన. సరిలే, మాటిగా చెప్తాను. ఏదో ఒక బోడిని నా కాలికి తుదిబండలా కట్టాలని నాన్నగారితో బాటు అన్నలంతా చేరి, ఏదో ఒక కాన్స్పిరసీ మొదలెట్టారు. నీకు తెలియందేముంది? నీకు దూరమయి నే బ్రతకగలనా? నీవు లేని లోకం నా కెలా అవసరం? అందుకనే మనం త్వరగా మేలుకొని ఏదో ఒకటి చేయకపోతే— నాకు తెలుసు, రాధా, నా జీవితం ముక్కలయి సర్వనాశనం జరుగుతుంది. రాధా! ఐ లవ్ యూ. అవును, నువ్వు నాకు కావాలి. లేకపోతే నేను జీవించలేను.' ఆవేశంతో ఊగిపోయాడు రవి.

మళ్ళీ రవే అందుకున్నాడు: 'ఈ పెళ్ళి జరగని పక్షంలో, నీవు నాకు దూరమయ్యే రోజంటూ వస్తే, నా జీవితం వృథా. చచ్చి బ్రతుకుతాను, ప్రతి నిత్యం బ్రతికి చచ్చేకంటే. నాది ఆవేశం కాదు, రాధా! స్వచ్ఛమైన ప్రేమ. నిన్ను విడిచి బ్రతకలేని అసమర్థత. అందుకే అంటాను — చచ్చిపోతాను, రాధా .... తప్పకుండా ... మన్నిఘోర కృత్యాని కొడిగట్టలేనేమో కాని, నా కంతకన్నా మార్గం కనిపించటం లేదు.' సంతోషం, మరో ప్రక్క ఏమవుతుందో నన్న భయం, తనంటూ ఇష్టపడి, తనకోసం ఎల్లవేళలా జీవించే ఒక ప్రాణి ఉందన్న ఆత్మ సంతృప్తి — ఇలాంటివే మరెన్నో భావాలు పెనవేయగా కంటి వెంట అప్రయత్నంగా నీరు ఏకధారగా కారుతూ ఉంటే—'చాల్లే, రవీ! ఎప్పుడూ ఎందుకా వెధవ మాటలు. ఆశతోనే జీవించాలి. ఇప్పుడేమయిందని నీ కా భయం? అసలు ఆ మాట కొస్తే ఒకరికి తోడుగా మరొకరు ఒక జీవిత కాలమయినా కలిసి జీవించాలని కలలు గన్నాం. అలా జరుగుతుందనే ఇంకా నా నమ్మకం. ఒక వేళ నీ నమ్మకమే నిజమయితే, నా కోసం నీ ప్రాణాల్నే అర్పిస్తే, నా కింకా మొండి ధైర్యం మిగిలి ఉంటుందని, నా ప్రాణం అలానే ఉంటుందనా నీ ఊహ? నా పిచ్చి రవీ! నీ ప్రేమ నిజమయింది కాబట్టి, దానికే కానుకగా అర్పించుకున్న నీ ప్రాణం ఆకాశంతో కలిసిపోగానే, జీవచ్ఛవంలా మిగిలి ఉన్న నాకు మరో జీవితంతో ఆసక్తి కలిగి, అక్కడితో నా జీవితం వేరవుతుందనా నీ ఆలోచన? ను వ్వెంత అమాయకుడివి!' అని రవి ఏదో చెప్పబోతే ఊరుకోమన్నట్లు వారించింది రాధ.

'నన్ను చెప్పనీయి. ఏదో ఒక బంధం మనల్ని పెనవేసి, ఇంతవరకు లాక్కొచ్చింది. ఒకళ్ళను మరొకరు విడదీయలేనంత లోతుగా ఈ అనుబంధం పెరిగిపోయింది. మనం త్వరలోనే వివాహబంధంతో మరీ దగ్గరగా ఒకరి గుండెలో మరొకరం ఒదిగిపోదామన్న నమ్మకం నాకుంది. కానిపక్షంలో నువ్వు ఇప్పుడు





నృత్య గణపతి

ఫోటో— అశుతోష్ సిన్హా (పూరి)

చెప్పినట్లు, ఆ తినే విషమేదో ఇద్దరం తిందాం, అవసరమయితే ఇద్దరం కలిసే నూతిలో దూకుదాం. బ్రతికినా, చచ్చినా ఈ బంధాన్నెవరూ తెంచివేయలేరని లోకాన్ని మరోసారి హెచ్చరిద్దాం.' ఆవేశం రాను రాను ఎక్కువవుతూ ఉంటే, రవి అందుకున్నాడు:

'అవును, రాధా! రేపే మావాళ్ళతో మాట్లాడి పెళ్ళి ప్రయత్నాలు జరిగే ఏర్పాటు చేస్తాను. ముందు కాదన్నా, ఎలాగయినా ఒప్పించి తీరతాను. మరీ కాదంటారా? అవును, నువ్వు చెప్పింది నిజం. బ్రతికినా, చచ్చినా ఇద్దరం ఒకటిగానే ఎప్పటికీ మిగిలిపోవాలి. బ్రతకాలంటే కష్టంగాని ... చావాలంటే ఎంతసేపు! దురదృష్టవశాత్తు, మన కదే రాసి ఉంటే ఒకరి కౌగిల్లో మరొకరు దగ్గరగా, మరింత దగ్గరగా—అయితే ఈ లోకానికి దూరంగా ఈ సంఘాన్ని శపిస్తూ, ఈ లోకాన్ని దుమ్మెత్తిపోస్తూ ఇవన్నీ లేని మరో లోకానికి పోదాం.' ఆగి రాధ వైపు చూశాడు రవి. తృప్తిగా ఉంది ఆమె ముఖం—అవును, కలిసే చచ్చిపోదాం అన్నట్లుగా.

• • •

మనకి తర్వాతేం జరిగిందనేదే ముఖ్యం.

అనుకున్నట్లుగానే ఇద్దరూ చచ్చిపోతారు, అరవై ఏళ్ళ తర్వాతః ఆయుర్దాయం ముగిసిన వెనక.

విచిత్రమేమంటే, వాళ్ళిద్దరికీ [illegible] కూడా జరిగింది.

అయితే. ఇద్దరికీ ఒకరి కింకొక[illegible] మాత్రం కాదుః పెళ్ళి జరిగింది వ[illegible] కెవ్వరితోనో. బ్రతికినన్నాళ్ళూ సుఖం[illegible] గడిపి, కాలం సమీపించిన తర్వాతనే [illegible] తర్వాత మరొకరు చచ్చిపోయా[illegible] పాపం!